www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 9 జనవరి 2024
5
పశ్చిమ గోదావరి



ప్రయివేటు ల్యాబ్‌లకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి
డిఎంహెచ్‌ఒ డి.మహేశ్వరరావు

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలోని ప్రయివేటు ల్యాబ్‌లను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డి.మహేశ్వరరావు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విజయ ల్యాబ్ రిజిస్ట్రేషన్, రెన్యువల్ సర్టిఫికెట్లు, ఏయే పరీక్షలు చేస్తున్నది, ధరల పట్టిక, ల్యాబ్‌లో పనిచేస్తున్న సిబ్బంది విద్యార్హతలు జిల్లా వైద్యాధికారి పరిశీలించారు. అనంతరం అఖిల్ ల్యాబ్‌లో సర్టిఫికెట్లు, ల్యాబ్‌ను పరిశీలించి ల్యాబ్ టెస్టుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. రిజిస్ట్రేషన్ లేకపోయినా, రెన్యువల్ చేయించకపోయినా, ఆయా ల్యాబ్‌లకు ప్రత్యేక టీములు పంపించి నోటీసులు జారీ చేసి మూసివేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, ఆప్తాల్ మిక్ అధికారి ఎంఆర్‌కె.రాజు పాల్గొన్నారు.

నరసాపురం నుంచి

ప్రత్యేక రైలు కలేనా..!

రోజురోజుకూ పెరుగుతున్న రైల్వే ప్రయాణికులు
చెన్నై, బెంగళూరు, ముంబై వెళ్లేందుకు ఇబ్బందులు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు, నరసాపురం, భీమవరం వంటి ప్రాంతాల నుంచి విద్య, ఉద్యోగం, ఉపాధి నిమిత్తం ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఎక్కువ మంది వెళ్తున్నారు. దీంతో రైల్వే ప్రయాణికుల సంఖ్య కూడా పెరుగుతోంది. ఇప్పటికే రైల్వే డబ్లింగ్ పూర్తి కావడం, ప్రయాణ సమయం తగ్గడంతో ప్రయాణికుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ట్రైయిన్ టిక్కెట్లు దొరక్కపోవడం, అలాగే తత్కాల్ టికెట్లు కూడా దొరక్కపోవడంతో ప్రయివేట్ సర్వీసుల్లో హైదరాబాద్, బెంగళూరు, చెన్నయ్ తదితర ప్రాంతాలకు అధిక సంఖ్యలో వెళ్తున్నారు. అయితే కోనసీమ జిల్లా నుంచి, పాలకొల్లు, నరసాపురం ప్రాంతాల వారు బెంగళూరు, చెన్నయ్, ముంబై, ఢిల్లీ, కలకత్తా వెళ్లాలంటే నేరుగా రైలు సదుపాయం లేకపోవడంతో కారు, తదితర ప్రయివేటు వాహనాల్లో వెళ్తూ ఇబ్బందులు పడుతున్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రయాణికుల్లో కోనసీమ, గోదావరి జిల్లా వాసులే ఎక్కువగా ఉండడం విశేషం. నరసాపురం నుంచి ఈ నగరాలకు డైరెక్టు రైళ్లు లేకపోవడంతో రాజోలు, నరసాపురం, అమలాపురం నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్టు దాదాపు 10 సర్వీసులు విమానాల కోసం వెళ్తున్నాయంటే ట్రాఫిక్ ఎంత డిమాండ్ ఉందో అర్థం అవుతోంది. ప్రస్తుతం నేరుగా రైలు సౌకర్యం లేక ఇక్కడి వారు వెళ్లేందుకు అధిక ప్రయాస పడాల్సి వస్తోంది. నరసాపురం నుంచి నేరుగా చెన్నయ్, బెంగళూరు, ముంబై, న్యూఢిల్లీకి రైలు సౌకర్యం కల్పించాలని దశాబ్దాలుగా ప్రజలు కోరుతున్నారు. నరసాపురం - కోటిపల్లి రైల్వే లైన్ నిర్మాణం ప్రారంభమైంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం వాటా ఇవ్వకపోవడంతో దీని నిర్మాణం నత్తనడకన సాగుతోంది. నరసాపురం ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా చేయడం, సముద్రతీర ప్రాంతంలో జాతీయ రహదారి నిర్మాణం చేస్తే, నర్సాపురం నుంచి పెద్ద నగరాలకు నేరుగా రైల్వే సౌకర్యం కల్పించే అవకాశం ఉంది. ఇప్పటికే హైదరాబాద్ వెళ్లేందుకు నరసాపూర్ - లింగంపల్లి ఎక్స్‌ప్రెస్‌కు పది రోజుల ముందు కూడా టిక్కెట్ దొరకని పరిస్థితి. సెలవు, పండుగ రోజుల్లో ప్రత్యేక రైళ్లు వేస్తున్నా కూడా వాటిలో కూడా తత్కాల్ టిక్కెట్లు దొరకని పరిస్థితి ఉంది. నరసాపురం, పాలకొల్లు, భీమవరం నుంచి దాదాపు రోజుకు 30కి పైగా ఆర్‌టిసి బస్సులు హైదరాబాద్ వెళ్తాయి. వీటిలో కూడా టిక్కెట్లు దొరక్కపోవడంతో జనం ప్రయివేటు బస్సులను ఆశ్రయిస్తున్నాయి. ఇవి కూడా దాదాపు 40కు పైగా బస్సులు హైదరాబాద్ వెళ్తున్నాయి. పగటిపూట నర్సాపూర్- హైదరాబాద్ - నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్ ఉంది. రాత్రి సమయంలో భీమవరం నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు విశాఖ ఎక్స్‌ప్రెస్ ఉంది. అయినా హైదరాబాద్‌కు రద్దీ పెరుగుతూనే ఉంది. ప్రయాణికుల రద్దీని దృష్టి పెట్టుకొని రాత్రి 9 గంటల ప్రాంతంలో నర్సాపురం నుంచి బయలుదేరేలా మరో నరసాపూర్ - హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ వేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



చెన్నయ్, బెంగళూరుకు రైలు ఏర్పాటుకు కృషి

జక్కంపూడి కుమార్, దక్షిణ మధ్య రైల్వే డిఆర్‌సి సభ్యులు

నరసాపురం నుంచి చెన్నయ్, బెంగళూరుకు నేరుగా రైలు నడపాలని ప్రతి సమావేశంలో రైల్వే అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ నెలలో నరసాపురం నుంచి హుబ్లీకి డైరెక్ట్ రైలు ప్రారంభిస్తున్నాం. త్వరలో మిగిలిన సమస్యలు పరిష్కారం అవుతాయి.

ఎస్మాను ఉపసంహరించుకోవాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో నేతలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఎన్నికల సమయంలో అక్క చెల్లెమ్మలకు అండగా ఉంటానని హామీ ఇచ్చి జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఎస్మా చట్టం నెత్తిన పెట్టారని, ఈ చట్టాన్ని తక్షణం ఉపసంహరించుకుని అంగనవాడీ యూనియన్‌తో చర్చలు జరిపి సమ్మె విరమింపజేయాలని సిపిఎం, సిపిఐ, టిడిపి, జనసేన, కాంగ్రెస్ పార్టీలతో పాటు ప్రజా సంఘాల నాయకులు ముక్తకంఠంతో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. అంగన్వాడీల సమ్మెపై ప్రభుత్వం ఎస్మా చట్టం జిఒ విడుదల చేయడంపై సోమవారం స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన టిడిపి మాజీ మంత్రి పీతల సుజాత, నేతలు మెంటే పార్థసారథి, వేండ్ర శ్రీనివాస్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ దుర్మార్గ వైఖరికి ఇదో నిదర్శనమన్నారు. చట్టం ఉంది కదా అని అడ్డదిడ్డంగా ఉపయోగించడం సరైంది కాదన్నారు. అంగన్వాడీలను భయపెట్టడానికే ఈ చట్టం తీసుకొచ్చారనేది స్పష్టమవుతోందని, భయపడాల్సిన అవసరం లేదని, రాష్ట్రంలో ప్రతిపక్షాలు ప్రజా సంఘాలు అంతా మీ తరపున ఉన్నామని తెలిపారు. కాంగ్రెస్ జిల్లా నాయకులు వంశీరెడ్డి, జనసేన నాయకులు సిహెచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ అధికార పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందన్నారు. పిచ్చుక మీద బ్రహ్మాస్త్రంలా అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగించడం దుర్మార్గ చర్యని అన్నారు. అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాల్సింది పోయి నిర్బంధం విధించడం పిరికిపంద చర్య అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ ఎస్మా చట్టాన్ని వెనక్కి తీసుకుని అంగన్‌వాడీల డిమాండ్లను పరిష్కరించకపోతే రాష్ట్ర బంద్‌కు పిలుపునిస్తామని ఆయన హెచ్చరించారు. ఎన్నికల సమయంలో అక్క చెల్లమ్మలని చెప్పి కల్లబొల్లి కబుర్లు చెప్పిన జగన్ ఇప్పటికీ ఆ హామీ అమలు చేయకుండా మాట తప్పారని విమర్శించారు. మంత్రులు రాష్ట్రానికి డబ్బులు లేవని చెబుతున్నారని, అయితే విశాఖ జిల్లాలో సిఎం క్యాంప్ ఆఫీస్‌కు రూ.500 కోట్లు ఎలా ఖర్చు పెట్టారని ప్రశ్నించారు. ఎక్కడికక్కడ దళితులపై అనేక దాడులు జరుగుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. ఎస్మా చట్టంలో అంగన్వాడీలకు ఎవరు మద్దతిచ్చినా వారిపై కేసులు కడతామని బెదిరిస్తున్న ప్రభుత్వానికి ముందు తమపై కేసులు పెట్టుకోండి అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఐ జిల్లా నేత కోనాల బీమారావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్ రాయ్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందన్నారు. తగిన గుణపాఠం ప్రజలే చెబుతారన్నారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకుంటే పోరాటం ఉధృతం చేస్తామని, దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతుల సంఘం, కెవిపిఎస్ నాయకులు జక్కంశెట్టి సత్యనారాయణ, మామిడి శెట్టి రామాంజనేయులు, కె.క్రాంతిబాబు మాట్లాడుతూ అంగన్వాడీల పోరాటానికి ముందుండి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. గుడ్డి చట్టాలను వెనక్కి తీసుకుని అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.కళ్యాణి, భీమవరం బార్ అసోసియేషన్ నాయకులు మొగళ్ల వెంకటరమణ, టిడిపి నాయకులు ఎద్దు ఏసు పాదం, మెరగాని నారాయణమ్మ మాట్లాడారు. ఈ సమావేశంలో బండి రమేష్, సుబ్రహ్మణ్యంరాజు, వెంగ్ర శ్రీనివాస్, మాదాసు కనకదుర్గ, సబీనా బేగం, సిఐటియు నాయకులు ఇంజేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

కొనసాగిన మున్సిపల్ కార్మికుల సమ్మె


సమ్మెకు మద్దతు తెలుపుతున్న మాజీ ఎంఎల్‌ఎ రాధాకృష్ణ

ప్రజాశక్తి - తణుకు

తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేస్తున్న మున్సిపల్ కాంటాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు తణుకు మాజీ ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ సంఘీభావం తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదురుగా 15 రోజులుగా నిరసన దీక్ష చేస్తున్న కార్మికులకు ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్మికులకు వెంటనే సమాన పనికి సమాన వేతనం ఇస్తామని, రూ.26 వేల జీతం ఇస్తామని చెప్పి మోసం చేశారన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వారి డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. అనంతరం జిఒ కాపీలను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, నాయకులు కలగర వెంకటకృష్ణ, ఉమ్మి రాము, తమరాపు వల్లపు రావు మారుతీరావు, హనుమంతరావు పాల్గొన్నారు.

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల సమ్మె 14వ రోజుకు చేరింది. ప్రతిపక్ష పార్టీల మద్దతు కూడగట్టుకుని సమ్మెను ఉధృతం చేస్తామని మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల యూనియన్ గౌరవాధ్యక్షులు కామన మునిస్వామి తెలిపారు. సమ్మెకు మాజీ ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకష్ణ మద్దతు తెలిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తణుకు మున్సిపల్ మాజీ ఛైర్మన్ డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, పట్టణ అధ్యక్షులు కలగర వెంకటకృష్ణారావు, యూనియన్ నాయకులు నీలపు ఆదినారాయణ, మజ్జి కృష్ణబాబు పాల్గొన్నారు.

మద్యపాన నిషేధం అమలు చేయాలి

మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జగదాంబ, పుష్పకుమారి

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్రంలో సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేసి మహిళల బతుకుల్లో వెలుగు నింపాలని ఎపి మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి నెక్కంటి జగదాంబ, సికిలే పుష్పకుమారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళా సమాఖ్య రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం కలక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. అనంతరం స్పందనలో జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేస్తామని, మద్యాన్ని ఐదు నక్షత్రాల హోటళ్లకే పరిమితం చేస్తామని గత ఎన్నికల సందర్భంగా జగన్ హామీ ఇచ్చి మాట తప్పారని విమర్శించారు. అలాగే వృద్ధులు, వితంతువులు, చేనేత, గీత, ఒంటరి మహిళలకు ఇస్తున్న సామాజిక సంక్షేమ పించన్లను రూ. 6 వేలకు పెంచాలని, వికలాంగులకు రూ.7 వేల పింఛను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలు మండలాల మహిళా సమాఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


డిఆర్‌ఒకు సమస్యలు విన్నవిస్తున్న నేతలు

మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలి

10న సిఎం కార్యాలయం ముట్టడి

ప్రజాశక్తి - ఆచంట

మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరుతూ ఈ నెల పదో తేదీన సిఎం కార్యాలయాన్ని ముట్టడిస్తున్నట్లు డివైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు ఎస్‌విఎన్.శర్మ, జిల్లా సహాయ కార్యదర్శి పిల్లి చంటిబాబు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాసంఘాల కార్యాలయం వద్ద చలో సిఎం క్యాంపు కార్యాలయం పోస్టర్స్ సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా శర్మ, చంటిబాబు మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉండగా అధికారంలోకి రాగానే ఏటా మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేస్తానని, జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తానని చెప్పి రాష్ట్రంలోని నిరుద్యోగులను నమ్మించి నట్టేట ముంచారని విమర్శించారు. అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళు దాటినా ఒక్క నోటిఫికేషన్ కూడా విడుదల చేయలేదన్నారు. ఉపాధ్యాయ కొలువుల కోసం కళ్లు కాయలుకాసేలా ఎదురుచూస్తున్నా నోటిఫికేషన్ రాకపోవడంతో నిరుద్యోగులు తీవ్ర నిరాశ, నిస్పృహలకు గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నా ముఖ్యమంత్రిలో చలనం లేకపోవడం దుర్మార్గమని విమర్శించారు. ఈ నెల 10వ తేదీన చలో సిఎం కార్యాలయాన్ని ముట్టడిస్తామని తెలిపారు. ఈ ముట్టడిలో ఏం జరిగినా దానికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. ఇప్పటికైనా 9వ తేదీలోపు మెగా డిఎస్‌సి విడుదల చేయకపోతే 10వ తేదీన డిఎస్‌సి అభ్యర్థుల సత్తా చూపుతామని హెచ్చరించారు. నిరుద్యోగులంతా సిఎం కార్యాలయం ముట్టడిలో పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు. సమావేశంలో డివైఎఫ్‌ఐ నాయకులు కె.జయరాజు, తమరాపు దుర్గాప్రసాద్, జి.మోహన్‌కుమార్, పి.మోహన్, నిరుద్యోగ జెఎసి నాయకులు దిగమర్తి వెంకటరమణ, తోట నవీన్, కె.సాయి శంకర్ పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డివైఎఫ్‌ఐ నేతలు

సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ రామ్ సుందర్ రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

స్పందన ద్వారా వచ్చే అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను జిల్లా జాయింట్ కలెక్టరు ఎస్.రామ్ సుందర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణరెడ్డి, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి ఆర్‌సి ఆనందకుమార్, డిఆర్‌డిఎ పీడీ ఎన్‌విఎస్.ప్రసాద యాదవ్, డిఎస్‌పి బి.శ్రీనాథ్‌తో కలిసి జిల్లా జాయింటు కలెక్టరు 289 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారులు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పక పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి ఆర్‌సి ఆనంద కుమార్, డిఆర్‌డిఎ అధికారి ప్రసాద యాదవ్, డిఎస్‌పి బి.శ్రీనాథ్ పాల్గొన్నారు.


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జెసి రామ్ సుందర్‌రెడ్డి

కొనసాగిన ఎస్ఎస్‌ఎ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - భీమవరం రూరల్

20 రోజుల నుంచి తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని తాము సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని సమగ్ర శిక్ష జెఎసి జిల్లా అధ్యక్షులు షేక్ బాబాజీ అన్నారు. సోమవారం సమగ్ర శిక్ష ఉద్యోగులు పట్టణంలోని ప్రధాన రహదారుల్లో బైక్ ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బాబాజీ మాట్లాడుతూ తాము చాలీచాలని జీతాలతో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్నామన్నారు. పాదయాత్ర సమయంలో జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తానని హామీ ఇచ్చారన్నారు. నాలుగున్నర ఏళ్లు గడుస్తున్నా ఇప్పటివరకూ మా ఆవేదనను పట్టించుకోలేదని ఆవేదన చెందారు. యూనియన్ నాయకులతో చర్చలు జరిపి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు వెంకటేశ్వరరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎస్‌ఎ ఉద్యోగులు

మొగల్లు హెచ్‌ఎం త్రినాధులుపై విచారణ

పాలకోడేరు: మొగల్లు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంవి.త్రినాథులుపై వచ్చిన అభియోగాలపై విద్యాశాఖ ఉన్నతాధికారులు సోమవారం విచారణ చేపట్టారు. పాఠశాలలో పనిచేస్తున్న తోటి ఉపాధ్యాయులు ఇటీవల హెచ్‌ఎం త్రినాథులుపై 32 అంశాల్లో డిఇఒ ఆర్.వెంకటరమణకు ఫిర్యాదు చేశారు. అలాగే యుటిఎఫ్, ఎస్‌టియు సంఘాలకు కూడా ఉపాధ్యాయులు ఫిర్యాదు చేయడంతో ఆ సంఘాల నేతలు కూడా డిఇఒ రమణ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. దీనిలో భాగంగా పాఠశాలలో సోమవారం సాయంత్రం అసిస్టెంట్ డివైఇఒ శ్రీరామ్ విచారణ చేపట్టారు. హెచ్‌ఎం త్రినాథ్‌లును విచారించిన అనంతరం ఫిర్యాదు చేసిన ఉపాధ్యాయులను కూడా విచారించారు. ఉపాధ్యాయులంతా ఏకపక్షంగా హెచ్‌ఎం త్రినాథులు పెట్టిన ఇబ్బందులపై ఏకరువు పెట్టారు. హెచ్‌ఎం అనే అధికారాన్ని ఉపయోగించుకుని తాను ఆడిందే ఆట పాడిందే పాట అన్నట్లుగా తోటి ఉపాధ్యాయులను పలుమార్లు ఇబ్బందులకు గురి చేశారని అధికారుల వద్ద ఉపాధ్యాయులు వాపోయారు. విద్యార్థులు తమ పట్ల హెచ్‌ఎం వ్యవహరించిన తీరుపై ఉన్నతాధికారులకు వివరించారు. గ్రామస్తులు సైతం హెచ్‌ఎం వ్యవహారి శైలి పట్ల విసుగుచెంది పలు విషయాలు, సమస్యలు అధికారులకు విన్నవించారు. ఈ నేపథ్యంలో యుటిఎఫ్, ఎస్‌టియు నేతలు హెచ్‌ఎం త్రినాథులు, విచారణ అధికారులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులతో మాట్లాడి సమస్యను సామరస్యంగా పరిష్కరించారు. తనకు ఆరోగ్యం బాలేదని, అందుకే అలా ప్రవర్తించానని హాస్పిటల్‌కు చూపించుకునే నిమిత్తం మూడు నెలలు మెడికల్ లీవు పెడతానని హెచ్‌ఎం త్రినాథులు అధికారులకు విన్నవించారు. దీనికి ఉపాధ్యాయులు కూడా అంగీకరించడంతో సమస్య సామరస్యంగా పరిష్కారమైంది. అధికారులు నామమాత్రంగా చర్యలు తీసుకున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.


త్రినాథులును విచారిస్తున్న అధికారులు

ఉపాధి పనులు చూపాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ రావు

ప్రజాశక్తి - భీమవరం

గ్రామాల్లో ఉపాధి పనులు చేపట్టి కార్మికులను ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కళింగ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించి జిల్లా రెవెన్యూ అధికారి బి.శ్రీమన్నారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కళింగ లక్ష్మణరావు మాట్లాడుతూ గ్రామాల్లో పేదల స్థితిగతుల్లో మార్పురావడం కోసం తీసుకొచ్చిన ఉపాధి హామీని కేంద్రం నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. బడ్జెట్ కేటాయింపులు ఇవ్వాలని, పని ప్రదేశంలో మృతి చెందిన వారికి రూ.పది లక్షలు ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోన గొల్లయ్య, పీతల రవి, జె.వెంకట్రావు, కె.జీవరాజు, పి.వెంకట్రావు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న వ్యకాస నాయకులు

డబుల్ మెజార్టీతో గెలుస్తా

పితానికి ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు సవాల్

ప్రజాశక్తి - ఆచంట

రానున్న ఎన్నికల్లో ఇక్కడి నుంచే పోటీచేసి టిడిపిపై గతంలో కంటే డబుల్ మెజార్టీతో విజయం సాధిస్తానని ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు సవాల్ విసిరారు. సోమవారం పోడూరు మండలం తూర్పుపాలెం ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయం వద్ద విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రెండోసారి ఆచంట నియోజకవర్గంలో పితానిని ఓడించి డబుల్ మెజార్టీతో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం ఆచంటలో జరిగిన రా కదలిరా టిడిపి సభలో మాజీ మంత్రి పితాని సత్యనారాయణ తనపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం హేయమైన చర్య అన్నారు. చంద్రబాబు నాయుడు వైసిపి ఎంఎల్‌ఎలపై వ్యక్తిగత ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు నాయుడు వాస్తవాలు తెలుసుకోకుండా జిల్లాలోని మంత్రులు, ఎంఎల్‌ఎల గురించి ఎవరో రాసి ఇచ్చిన స్క్రిప్ట్‌లోని అవాస్తవాలు చదవడం దారుణం అన్నారు. పితాని సత్యనారాయణ 15 సంవత్సరాలు మంత్రిగా పనిచేసినా తన స్థాయికి తగ్గట్టు మాట్లాడ లేదని విమర్శించారు. టిడిపి సభకు జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జిని పిలవకపోవడం పితానికి కాపులపై ఉన్న అహంకారానికి ఇదే నిదర్శనం అన్నారు. డబ్బులిచ్చి సభకు ప్రజలను రప్పించడానికి ప్రయత్నించినా అట్టర్ ప్లాప్ అవ్వడమే కాకుండా తెట్టతెలమైందన్నారు. రానున్న ఎన్నికల్లో ఎవరు అవినీతిపరులనేది ప్రజలే నిర్ణయిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య, సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్, జక్కంశెట్టి చంటి, కర్రి సుభాషిని, వేణుబాబు, గుంటూరు వాణి పెద్దిరాజు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ శ్రీరంగనాథరాజు

విద్యార్థులకు బహుమతులు

ప్రజాశక్తి - వీరవాసరం

స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులు సమాజంలో యువత పాత్రపై వ్యాసరచన పోటీలు వివిధ కేటగిరిల్లో నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి సబ్బారపు వెంకట్రావు, కమల ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బహుమతులు అందించారు. ఎస్‌బిఐ డిప్యూటీ మేనేజర్ జె.శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జుత్తిగ శ్రీనివాసరావు, సబ్బారపు వెంకట్రావు, బండారు అప్పారావు, నక్కెళ్ల సత్యనారాయణ, గౌరిశంకర్, పంపన సాయిబాబు, ఫణికుమార్ పాల్గొన్నారు.

సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి - కాళ్ల


గ్రావెల్ సరిచేస్తున్న పొక్లెయిన్

గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా మారడంతో ఓ సర్పంచి తమ సొంత నిధులతో రోడ్డు మరమ్మతులు చేసేందుకు ముందుకు వచ్చారు. దొడ్డనపూడి గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డు గోతుల మయంగా మారింది. కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ప్రారంభమై కచ్చా గరువు వరకు సుమారు మూడు కిలోమీటర్ల పొడవునా రోడ్డు అధ్వానంగా తయారైంది. ఈ రోడ్డుపై ప్రయాణికులు, వాహనదారులు అవస్థలు పడుతూ ప్రయాణిస్తున్నారు. ప్రభుత్వానికి, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదు. రోడ్డును తామే బాగు చేసుకోవాలని కొల్లి సుబ్బారావు నిర్ణయించారు. గుంతలు పడిన రోడ్డుపై గ్రావెల్ వేసి చదును చేసే పనులు చేపడు తున్నారు. లక్షల రూపాయలతో గ్రావెల్ రోడ్డు మరమ్మతులు చేపడుతున్న సర్పంచి కొల్లి సుబ్బారావు చేస్తున్న కృషికి ప్రయాణికులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వాలంటీర్ల ధర్నా

ప్రజాశక్తి - పోడూరు

తమను ఆకారణంగా వాలంటీర్ విధుల నుంచి తొలగించారని, అందుకు గల కారణాలను తెలపాలని కోరుతూ వాలంటీర్లు రావి హెప్సిబా, పిల్లి సునీల్ లబ్ధిదారులతో కలిసి ఎంపిడిఒ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపిడిఒ డి.సుహాసినిని కలిసి తమకు జరిగిన అన్యాయం గురించి వివరించి తొలగించడానికి గల కారణాలు తమకి తెలిపాలని వారు కోరారు. ఎంపిడిఒ సానుకూలంగా స్పందించి రెండు రోజుల్లో పూర్తి వివరాలు తెలుపుతానని తెలిపారు. అనంతరం దళిత నాయకుడు ఉన్నమట్ల ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ రాజకీయ నాయకుల కక్షలతో రెండు నెలల చిన్న పిల్లాడిని కలిగి ఉన్న రావి హెప్సిబాను కారణం చెప్పకుండా తొలగించడం అన్యాయమన్నారు. విధుల నుంచి తొలగించిన వారికి వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు రావి హరీష్‌బాబు, పిల్లి చంద్రమోహన్, కలిగిరి నరసింహమూర్తి, పిల్లి ఆసాపు పాల్గొన్నారు.

కొమ్ముచిక్కాలలో 'గడపగడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని కొమ్ముచిక్కాలలో వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ ఆధ్వర్యంలో సోమవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలు గోపీ దృష్టికి తీసుకొచ్చారు. ఆయన స్పందించి అధికారులతో మాట్లాడి పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా గోపీ మాట్లాడుతూ నవరత్నాల ద్వారా ప్రజలకు నేరుగా అనేక సంక్షేమ పథకాలు పేదల కోసం అమలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, జెడ్‌పిటిసి సభ్యులు గుంటూరి పెద్దిరాజు, ఎంపిపి సబ్బితి సుమంగళి సాగర్, మండల కన్వీనర్ పితాని సత్యనారాయణ(చిన్న), గుంటూరి చంటిరాజు, నాగరాజు, బాలాజీ వర్మ పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని దాతలు జివాజి గోల్డ్ అధినేత మనోజ్ సూచించారు. మండలంలోని కెపి.పాలెంలో ఉన్న జెడ్‌పి ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నరసాపురానికి చెందిన జివాజి గోల్డ్ అధినేతలు ఆర్థిక సహాయంతో యుటిఎఫ్ ఆధ్వర్యంలో ముద్రించిన టెస్ట్ పేపర్లను సోమవారం విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టంతో చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో జివాజి సోను, పిఎంసి ఛైర్మన్ బుల్లి నర్సులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, జెవి.నరసింహమూర్తి, మొగల్తూరు లయన్స్ క్లబ్ సభ్యులు చింతపల్లి కృష్ణమోహన్, పాఠశాల స్టాఫ్ సెక్రటరీ పి.శ్రీనివాస్, పాఠశాల ప్రథమ సహాయకులు వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సూర్యప్రకాశరావు మృతి

ప్రజాశక్తి -పాలకోడేరు

శృంగవక్షం శ్రీ వాసవీ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సూర్యప్రకాష్‌రావు (78) మృతి చెందారు. నెల రోజులుగా అనారోగ్యంతో ఎయిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన పరిస్థితి విషమించి సోమవారం ఉదయం మృతి చెందారు. ఆయన మృతి పట్ల ఆర్యవైశ్య సంఘం తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. సంఘం అభివృద్ధికి, కళ్యాణ మండపం అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, పేదలకు సహాయం చేయడంలో ముందుండేవారని సంఘం కార్యదర్శి సభ్యులు కూర్మా నారాయణరావు, గ్రంథి రాజా, పచ్చిపులుసు యానాది శెట్టి, సోమ రామకృష్ణ, పూర్ణారావు, బ్రహ్మాజీ, నరసింహారావు అన్నారు. ఆయన మృతి సంఘానికి తీరని లోటన్నారు. శృంగవృక్షం గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గుబ్బల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు యామల రాంబాబు సంతాపం తెలిపారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఓటును ఒకటికి రెండు సార్లు ఆలోచించి సమర్ధవంతమైన నాయకత్వానికి వేయాలని జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జి.జేమ్స్ అన్నారు. జిల్లా రెవెన్యూ శాఖ, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులతో ఓటు హక్కు వినియోగంపై సోమవారం అవగాహనా సదస్సు ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా జేమ్స్ మాట్లాడుతూ సంఘటితంగా అందరం సుస్థిర పాలకులను ఎన్నుకోవాలని, ఎటువంటి ప్రలోభాలకు లొంగకూడదన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి ప్రస్తుతమైన ఓటు ప్రతిజ్ఞ నిర్వహించారు. అనంతరం ప్రకాశం చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు కె.చంద్రరావు, పివిఎస్.ప్రసాద్, ఎండి అలీ, ఎం.పుల్లరాజు, కె.రంగరాజు, కొల్లా రాజు, వాన్‌భాషా పాల్గొన్నారు.

'మెరుగైన పాలన అందించడంలో వైసిపి విఫలం'

ప్రజాశక్తి - ఉండి

దుష్ట పాలనకు చరమగీతం పాడాలని ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. ఉండి మండలంలోని చిలుకూరులో సోమవారం ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్ఎ రామరాజు సమక్షంలో మాజీ సర్పంచి బంగారాజు ఆధ్వర్యంలో పలువురు వైసిపి నాయకులు టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రామరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన పాలనను అందించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. మండలంలో పాలనను గాలికి వదిలేసి కేవలం ప్రతిపక్షాల పైన విమర్శలు చేయడానికి ఉన్నారన్నారు. అవినీతి ధోరణిలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షులు కొమెరెల నాగరాజు, ప్రధాన కార్యదర్శి కిన్నెర వెంకన్న, రాష్ట్ర కార్యదర్శి పోతూరి వెంకటేశ్వరరాజు పాల్గొన్నారు.

చంద్రబాబు సభ విజయవంతం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

చంద్రబాబు ఆచంట రా కదిలి రా బహిరంగ సభ విజయవంతమైందని టిడిపి జిల్లా అధ్యక్షులు, భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి సోమవారం ప్రకటనలో తెలిపారు. రా కదిలిరా మహాసభను విజయవంతం చేసిన తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకు, ప్రజానీకానికి ధన్యవాదాలు తెలిపారు. సిఎం జగన్ ప్రజావేదిక కూల్చివేత నుంచి ప్రారంభమైన విధ్వంస అవినీతి అరాచక పాలనకు స్వస్తి పలకాలని, ఎన్నికల కోసం వచ్చిన ఆంధ్రప్రదేశ్ లేదని, వచ్చిన రాష్ట్రంలో ప్రతిరోజూ రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. యువతకు జాబ్ క్యాలెండర్ లేకుండా గంజాయి బానిసలుగా చేసి వారి భవిష్యత్తును నాశనం చేశారన్నారు.

ఎన్ని జిఒలు తెచ్చినా వెనక్కి తగ్గం

తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె సోమవారంతో 28వ రోజుకు చేరుకుంది. సమస్యలు పరిష్కరించకుండా ఎన్ని జిఒలు తెచ్చినా వెనక్కి తగ్గమని అంగన్‌వాడీలు స్పష్టం చేశారు.

ప్రజాశక్తి - కాళ్ల

ప్రభుత్వం తమ డిమాండ్లు పరిష్కరించకుండా ఎన్ని చట్టాలు తీసుకొచ్చిన అంగన్‌వాడీ కేంద్రాలు తెరిచేది లేదని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ ప్రాజెక్టు లీడర్ దావులూరి మార్తమ్మ అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ప్రభుత్వం జారీ చేసిన ఎస్మా జిఒను దహనం చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు లీడర్ దావులూరి మార్తమ్మ మాట్లాడారు.

ఆచంట (పెనుమంట్ర) :స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీ రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. ఈ దీక్షల్లో జిఒ-2ను అంబేద్కర్ విగ్రహానికి అందించి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కోడె శ్రీనివాసప్రసాద్, పెనుమంట్ర, ఆలమూరు, మార్టేరు సెక్టార్ నాయకులు సాయిమహాలక్ష్మి, మౌనిక, సరస్వతితో పాటు కార్యకర్తలు సావిత్రి, మల్లిపూడి కల్యాణి, సూర్యకుమారి, సూర్యప్రభ, కల్యాణి, టిఎల్‌డి భవాని, భాగ్యలక్ష్మి, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు కూసంపూడి సుబ్బరాజు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కెఎస్‌వి.శ్రీనివాస్ సంఘీభావం తెలిపారు.

పాలకోడేరు : పాలకోడేరులో అంగన్వాడీలు ఎస్మా జిఒను రద్దు చేయాలని కోరుతూ అల్లూరి సీతారామరాజు విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సమ్మె శిబిరం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు విజయలక్ష్మి, విమల, సోని, మంగతాయారు, విమల కుమారి, నాగలక్ష్మి, జ్యోతి పాల్గొన్నారు.

యలమంచిలి : స్థానిక యలమంచిలి సెంటర్‌లో మానవహారం నిర్వహించి అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి దేవ సుధాకర్, అంగన్వాడీ నాయకులు రజని, దేవి, కల్యాణి, శకుంతల, సుధారాణి, స్వాతి పాల్గొన్నారు.

తణుకు రూరల్ : స్థానిక కోర్టు సెంటర్ వద్ద ఉన్న సమ్మె శిబిరానికి టిడిపి పట్టణ అధ్యక్షులు కలగర వెంకటకృష్ణ, సిపిఎం పట్టణ కార్యదర్శి పివి.ప్రతాప్, సిపిఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, కాంగ్రెస్ పట్టణ కార్యదర్శి డి.రామకృష్ణ, జనసేన నాయకులు అనుకుల రమేష్, ఐలు జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి, పౌర హక్కుల నాయకులు కౌరు వెంకటేశ్వర్లు వచ్చి ఎస్మా ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా టిడిపి మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడారు.

ఆచంట : ఆచంట కచేరి సెంటర్‌లో జిఒ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి వద్దిపర్తి అంజిబాబు మాట్లాడారు.

మొగల్తూరు : ప్రభుత్వ మొండి వైఖరి మారాలని కోరుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి అంగన్‌వాడీలు వినతిపత్రం అందించారు. అంగన్వాడీలు దీక్షా శిబిరం నుంచి గ్రామాల్లో ప్రదర్శన చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. స్థానిక గాంధీభవన్ సెంటర్ ప్రాంతంలో మానవహారం నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి వినతిపత్రం అందించారు.


పాలకోడేరులో...

ఆకివీడు : స్థానిక సమ్మె శిబిరం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు జాతీయ రహదారిపై ర్యాలీగా వచ్చి వినతిపత్రం అందించారు. అనంతరం 1వ సెగ్మెంట్ అంగన్వాడీలు జిల్లా కేంద్రం భీమవరంలో జరుగుతున్న 24 గంటల రిలే నిరాహార దీక్షలో పాల్గొనేందుకు తరలి వెళ్లారు. మిగిలిన అంగన్వాడీలు దీక్ష కొనసాగించారు. సిఐటియు మండల కార్యదర్శి తవిటినాయుడు మాట్లాడారు.


యలమంచిలిలో...

నరసాపురం టౌన్ : అంగన్వాడీ సమ్మెకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎస్మా జిఒను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సెంటర్ వద్ద నిరసన తెలిపారు. ఎస్మా జిఒ ప్రతులు దహనం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడారు.

గణపవరం : గణపవరంలో అంగన్‌వాడీలు అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్వాడీ మండల కమిటీ నాయకులు బి.రామకోటి మాట్లాడారు.

ఉండి : తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు పాటలు పాడుతూ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు గడి కుసుమ, ఝాన్సీ, లలిత, శ్రీదేవి, ప్రేమలత, విజయకుమారి, అనురాధ, గోవిందకుమారి, రాజశ్రీ, లక్ష్మి, అరుణ, ఉషారాణి, భాను, గొల్లమ్మ, అన్నపూర్ణ, రోజా, కనకలక్ష్మి, వాణి, సుబ్బలక్ష్మి, రత్నం పాల్గొన్నారు.

వీరవాసరం : వీరవాసరం సమ్మె శిబిరం వద్దకు మాజీ మంత్రి పీతల సుజాత వచ్చి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వీరవల్లి దుర్గాభవాణి, టిడిపి మండలాధ్యక్షుడు కొల్లేపర శ్రీనివాసరావు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పోడూరు : స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట దీక్షా శిబిరంలో అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ లీడర్ పీతల రాజమణి, జె.ఉమాదేవి, రాయుడు కుమారి, సిఐటియు నాయకులు పిల్లి ప్రసాద్, బూరాబత్తుల వెంకటరావు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : అంగన్‌వాడీలు స్థానిక అంబేద్కర్ సెంటర్ చేరుకుని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి పొన్నాడ రాము, అంగన్వాడీ నాయకులు పాల్గొన్నారు.

పెనుగొండ : అంగన్‌వాడీలు అంబేద్కర్ విగ్రహం వద్దకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు కె.తులసి మాట్లాడారు.

అస్వస్థతకు గురైన అంగన్‌వాడీ సహాయకురాలు

భీమవరం రూరల్ :అంగన్వాడీ కార్యకర్తలపై అధికారులు, రాజకీయ నాయకులు వేధింపులు ఆపాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామోహన్‌రాయ్ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ సమ్మెలో భాగంగా స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద 28వ రోజు నిరసన కార్యక్రమానికి పోడూరు మండలం జిన్నూరు గ్రామానికి చెందిన 27వ కోడ్ నెంబర్ అంగన్వాడీ సెంటర్‌లో పని చేస్తున్న సహాయకురాలు లక్ష్మికి ఆమె సూపర్‌వైజర్ ఫోన్ చేసి "నువ్వు ఎక్కడున్నా వచ్చి సెంటర్ తీయాలి" అని ఒత్తిడి చేయడంతో లక్ష్మి ఆందోళన చెంది అస్వస్థతకు గురైంది. అక్కడే ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సిఐటియు నాయకులు ఆమెకు సపర్యాలు చేసి ఒఆర్‌ఎస్ తాగించి యుటిఎఫ్ కార్యాలయంలోకి తరలించి విశ్రాంతి తీసుకోమన్నారు. ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలను పరిష్కరించి సమ్మె విరమింపచేయాలని, అధికారం అడ్డం పెట్టుకొని అధికారులతో అంగన్వాడీ కార్యకర్తలపై ఒత్తిడి తెచ్చి మానసికంగా హింసించడం సరికాదన్నారు.

ఫుడ్ కమిషన్ సభ్యులకు వినతి

పాలకొల్లు : పాలకొల్లు విచ్చేసిన రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు లక్ష్మీరెడ్డి, జక్కంపూడి కిరణ్‌కృష్ణలకు అంగన్‌వాడీలు సోమవారం వినతిపత్రం అందించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని వారు హామీ ఇచ్చారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు


ప్రజాశక్తి - తణుకు

సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా డిప్యూటీ క్యాబినెట్ సెక్రటరీ వావిలాల సరళదేవి అన్నారు. సజ్జాపురం శ్రీ రామకృష్ణ సేవా సమితి వద్ద లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ స్వర్ణ లయన్స్ క్లబ్ సరళాదేవి వెంకటరమేష్ దంపతుల సంయుక్త ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. గంగిరెద్దుల విన్యాసం, హరిదాసు కీర్తనలు, బొమ్మల కొలువు, ముగ్గుల పోటీలు, వంటల పోటీలు, విచిత్ర వేషధారణలు, భోగి మంటలు, గాలిపటాలు, సాంప్రదాయ దుస్తులు, ఎడ్లబండితో వంటి విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఇంపల్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు వివిధ పోటీల్లో పాల్గొన్నారు. గెలుపొందినవారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, ఎంఎల్‌సి మల్టిపుల్ కౌన్సిల్ ఛైర్మన్ వంకా రవీంద్రనాథ్, ఫస్ట్ వైస్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు, సెకండ్ వైస్ జిల్లా గవర్నర్ ఎన్‌వివిఎస్.పాపారావు నాయుడు, లయన్స్ డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీ నూకల నాగమల్లేశ్వరరావు, రీజనల్ ఛైర్మన్ ఎంఆర్.కోటేశ్వరరావు, వట్టిప్రోలు ఆర్‌ఎస్ కృష్ణారావు, మదనమోహన్ అగర్వాల్, చిట్టూరి సుజాత, సుంకవల్లి చిరంజీవి కుమారి, గన్నమనేని లక్ష్మి పాల్గొన్నారు.

మొగల్తూరు :మండలంలోని కెపిపాలెం జెడ్‌పి పాఠశాలలో సోమవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు రంగవల్లి పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచినవారికి బహుమతులు అందించారు. తొలుత పాఠశాల ఆవరణలో భోగిమంట వేశారు.

పెనుగొండ :స్థానిక కంభాలవారి వీధిలో ఉన్న భాష్యం పాఠశాలలో సంక్రాంతి సంబరాలు విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఎన్.వెంకటఅప్పారావు మాట్లాడారు. ముగ్గుల పోటీలు, వంటల పోటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పోటీలో గెలిచినవారికి బహుమతులను అందించారు.

పాలకొల్లు :పాలకొల్లులో ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగే సంక్రాంతి సంబరాల్లో భాగంగా సోమవారం పట్టణ స్థాయిలో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. స్థానిక శ్రీనివాస డీలక్స్ రోడ్డులో జరిగిన ఈ పోటీల్లో మొత్తం 68 మంది పాల్గొనగా పది మంది విజేతలుగా నిలిచారు. పోటీలో పాల్గొన్న మహిళలందరికీ ధర్మారావు ఫౌండేషన్ తరపున చీర, ప్లాస్టిక్ డబ్బాను ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు అందించారు. మజా కంపెనీ మజా డ్రింక్‌ని అందించింది. పోటీల్లో విజేతలు 14వ తేదీన జరిగే ముగింపు సభ రోజున నియోజకవర్గ స్థాయిలో జరిగే ముగ్గుల పోటీలకు అర్హులని ఎంఎల్ఎ తెలిపారు. పాలకొల్లులోని జివిఎస్‌విఆర్‌ఎం మున్సిపల్ పాఠశాలలో పిఎంసి ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సాంప్రదాయ నృత్యులు చేశారు. ముగ్గుల పోటీల్లో విజేతలకు ఖజానా అధికారి ఎన్‌వివి.శ్రీనివాస్ సమకూర్చిన విద్యా సామగ్రిని పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రకళ, శశికళ, భవానిదుర్గ, త్రిమూర్తులు, పేరెంట్స్ కరణం వెంకటలక్ష్మి, సాయమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.


కాళ్లలో..

కాళ్ల :పాఠశాలలో నిర్వహించే కార్యక్రమాల వల్ల విద్యార్థులు మంచి లక్షణాలు పెంపొందించుకోవచ్చని ఎంఇఒ-2 గాదిరాజు కనకరాజు అన్నారు. వేంపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (హిందూ)లో సోమవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సంబరాలకు ఎంఇఒ కనకరాజు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.నాగమురళిశ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పివి.వరలక్ష్మి, బి.కిషోర్, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.


తణుకులో...

భీమవరం రూరల్ : ఆదిత్య స్కూల్‌లో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించినట్లు పాఠశాల డైరెక్టర్ లయన్ డాక్టర్ కృష్ణంరాజు తెలిపారు. విద్యార్థులు పలు వేషధారణలతో ప్రదర్శనలు చేశారని ప్రిన్సిపల్ టి.శ్రీనివాస్ తెలిపారు.

ఉండి :సంక్రాంతి విశిష్టతను విద్యార్థులకు తెలియజేయడం కోసం సంబరాలను ఏర్పాటుచేసిన శ్రీ శశి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ యాజమాన్యాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. ఉండి శ్రీ శశి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో సంక్రాంతి సంబరాలను స్కూలు కరస్పాండెంట్ ఖండాపు శ్రీనివాసరావు నాగమణి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. పాందువ్వ మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచి సాగిరాజు యామిని ప్రియాంక పాల్గొన్నారు. విద్యార్థులు వేసిన వివిధ వేషధారణలు, బొమ్మల కొలువులు, పల్లెటూరి వాతావరణాన్ని మైమరిపించే విధంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌లను, పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. పోటీల్లో గెలుపొందిన వారికి అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందించారు.

జూద క్రీడలు నిర్వహిస్తే కఠిన చర్యలు

పాలకోడేరు :సంక్రాంతి పండుగ నేపథ్యంలో జూద క్రీడలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పాలకోడేరు ఎస్ఐ నాళం శ్రీనివాసరావు హెచ్చరించారు. జూద క్రీడలు నిర్వహించొద్దని విస్సాకోడేరు సచివాలయంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని సర్పంచి బొల్లా శ్రీనివాస్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ జూద క్రీడలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఫుడ్ కమిషన్ సభ్యుల తనిఖీ

పాలకొల్లు:పాలకొల్లు పట్టణంలో స్టేట్ ఫుడ్ కమిషన్ సభ్యులు లక్ష్మీరెడ్డి, జక్కంపూడి కిరణ్‌కృష్ణ తనిఖీ చేశా రు. లంకలకోడేరు జెడ్‌పి హైస్కూల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. అనంతరం నరసాపురం గురుకుల పాఠశాల, రుస్తుంబాద సుబ్బారాయుడు మున్సిపల్ హైస్కూల్లను సందర్శించారు.

న్యాయస్థానం సిబ్బందికి హోమియో మందులు

పాలకొల్లు : పాలకొల్లు న్యాయస్థానంలో న్యాయవాదులకు, సిబ్బందికి కరోనా రాకుండా ముందు జాగ్రత్తగా హోమియోపతి మందులను సోమవారం ఉచితంగా పంపిణీ చేశారు. కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా ప్రతిఒక్కరూ మాస్క్ వాడుతూ జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు తలుపుల శ్రీనివాసరావు, పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు న్యాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మెగా అప్రంటీస్ మేళా

ఉండి :ఐటిఐ పూర్తి చేసిన ప్రతిఒక్కరూ అప్రెంటిస్ చేయాలని ఐఎస్‌డిఎస్ డైరెక్టర్ కొప్పర్తి శ్రీనివాసరావు అన్నారు. ఉండి ఐటిఐ కళాశాలలో ప్రిన్సిపల్ వేగేశ్న శ్రీనివాసరాజు అధ్యక్షతన నిర్వహించిన ప్రధానమంత్రి మెగా అప్రెంటిస్ మేళా కార్యక్రమాన్ని ఐఎస్‌డిఎస్ డైరెక్టర్ కొప్పర్తి శ్రీనివాసరావు ప్రారంభించారు. మెగా అప్రెంటిస్ మేళాలో భాగంగా పిఎం విశ్వకర్మ పథకాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ మౌళి, పి.శాంతను, ఎ.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు

ప్రజాశక్తి - ఆచంట (పెనుమంట్ర)

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కోడిపందేలు, పేకాట, గుండాట నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రొఫెషనల్ డిఎస్‌పి కె.అరవింద్ అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ సంక్రాంతి పండుగ నేపథ్యంలో కోడిపందేల స్థావరాల యాజమాన్యానికి ఇప్పటికే నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. పందెం రాయుళ్లపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

ఆదుకోవాలని ఆటో కార్మికుల నిరసన

ప్రజాశక్తి - భీమవరం రూరల్

జిల్లాలో వివిధ పట్టణాల్లో ఆటో కార్మికులందరూ సోమవారం ఉదయం నుంచి తమ ఆటోలను పక్కనపెట్టి, ఖాకి చొక్కా ధరించి ర్యాలీగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తే తమకు ప్రత్యామ్నాయం చూపాలని కోరారు. స్థానిక ప్రకాశం చౌక్ సెంటర్‌లో సుమారు రెండు వేల మంది ఆటో కార్మిక సోదరులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షులు ఇంటి సత్యనారాయణ, భీమవరం పట్టణ వర్కింగ్ కమిటీ అధ్యక్షులు పంపన గోపి, ఆరేపల్లి బాలాజీ, గోపాల్ కుమార్, సతీష్, జగన్ మోహన్‌రావు, గుల్లిపల్లి శ్రీను, సురేష్ స్వామి పాల్గొన్నారు.

కాళ్ల :జువ్వలపాలెంలో ఆటో డ్రైవర్లు ఆందోళన నిర్వహించారు. జువ్వలపాలెం ఆటో వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పాండ్రంకి దుర్గారావు మాట్లాడారు. ఈ ఆందోళనలో ఆటో వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎన్.దుర్గారావు, కార్యదర్శి నెమ్మది సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆచంట (పెనుమంట్ర) : మార్టేరు ఆటో యూనియన్ వర్కర్స్ మార్టేరు సెంటర్‌లో సమ్మె నిర్వహించారు. ఈ బంద్‌లో వినాయక, డాక్టర్ అబ్దుల్ కలాం, గణపతి, సిద్ధి వినాయక ఆటో యూనియన్ వర్కర్స్ పాల్గొన్నారు.

గణపవరం : గణపవరంలో ఆటో డ్రైవర్లు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ నాయకులు పి.పెద్దిరాజు మాట్లాడారు. అనంతరం జనసేన ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పచ్చిమట్ల ధర్మరాజుకు వినతిపత్రం అందించారు.

మొగల్తూరు : ఆటో యూనియన్ సభ్యులు ఆటోలు నిలుపుదల చేసి నిరసన ప్రదర్శన చేశారు.

నరసాపురం టౌన్ : నరసాపురం ఆటో యూనియన్ సభ్యులు నిరసన చేసి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వనమాడి రాంబాబు, ఎన్.సికిందర్, అడ్డాల రమేష్ బుజ్జి పాల్గొన్నారు.

ఆకివీడు : ఐ భీమవరం రోడ్డులో ఉన్న ఆటో స్టాండ్ వద్ద శిబిరం ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి ఎంపిడిఒ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి స్పందనలో వినతిపత్రం అందించారు.

ఉండి : ఉండి వ్యాప్తంగా ఆటో డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆటోడ్రైవర్లు బంద్‌ను పాటించారు. ఈ బంద్‌లో దర్శి ప్రసాద్, ఎం.విజయ్‌కుమార్, బొండాడ నాగబాబు, భోగేశ్వరరావు, జాలే యాకోబు, గంధం సూరిబాబు, కరోతి శ్రీను, ప్రసాద్, పాలూరు శ్రీను, రమేష్, నాని పాల్గొన్నారు.

వీరవాసరం :బస్టాండ్ వద్ద సన్‌రైజ్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సంధర్భంగా యూనియన్ నాయకులు డోకల శివ, జిల్లెల కాశీ మాట్లాడారు.

ఆటో కార్మికులకు న్యాయం చేస్తాం

:పాలకొల్లు :ఆటోపై ఆధారపడి జీవిస్తున్న డ్రైవర్లు, కార్మికులకు ఎటువంటి నష్టం కలగకుండా ప్రత్యామ్నాయంగా న్యాయం చేస్తామని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. ఆటో డ్రైవర్లు, కార్మికులు ఆ సంఘ ఆధ్వర్యంలో ఎంఎల్ఎను ఆయన క్యాంపు కార్యాలయంలో సోమవారం కలిశారు. టిడిపి, జనసేన కూటమి ఎన్నికల హామీలో భాగంగా ఆర్‌టిసిలో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు వల్ల తమ జీవనోపాధికి నష్టం కలుగుతుందని, ఆ హామీని విరమించుకోవాలని కోరారు. దీనిపై ఎంఎల్ఎ మాట్లాడుతూ ఆర్‌టిసిలో మహిళలకు ఉచిత ప్రయాణం వలన ఆటో కార్మికులకు నష్టం కలగకుండా ప్రత్యామ్నాయం చేసి న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు.